



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా॥రాయపాటి శైలజ



చీనీరైతు చిత్తు..!

మామిడి రైతు తరహాలోనే ఇప్పుడు చీనీ రైతు చిత్తవుతున్నాడు. గిట్టుబాటు ధర లేక రైతులు విలవిల్లాడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర లేకపోవడంతో అతి తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఒకవైపు ఉద్యానవన ఉత్పత్తులు జరిపి పెద్దఎత్తున ఉద్యానవన రైతుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు చేసిన ప్రకటనలేవీ ఆచరణలో కనిపించడం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అనంతపురం నగరంలో ఉద్యానవన ఎక్స్‌పో నిర్వహించి పెద్దఎత్తున ఉద్యానవన రైతుకు ప్రోత్సాహమన్న ప్రకటనలు అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చారు. ఆచరణలో నష్టపోతున్న రైతులకు అందుతున్న సహాయం ఏ మాత్రం ఉండటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- పతనమైన చీనీ ధర
- గిట్టుబాటు ధర లేక రైతు దిగాలు
- వ్యాపారులు దోపిడీ మరోవైపు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 91,886 ఎకరాల్లో చీనీసాగు ఉంది. ఏటా 5.21 లక్షల మెట్రిక్ టన్నుల చీనీ దిగుబడి వస్తుంది. రాష్ట్రంలో ఇంత పెద్దఎత్తున దిగుబడి వచ్చే జిల్లా మరొకటి లేదు. ఏడాదికి సగటున రూ.1562 కోట్ల టర్నోవర్ ఒక్క చీనీ వ్యాపారం ద్వారానే జరుగుతుంది. ఇంత పెద్దఎత్తున సాగయ్యే ప్రాంతంలో రైతుకు సరైన గిట్టుబాటు ధర కల్పించే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవైపు పెట్టుబడులు పెరిగాయి. మరో వైపు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం నగరంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌కు రోజుకు వెయ్యి టన్నుల వరకు చీనీ పంట వస్తోంది. గరిష్టంగా టన్ను రూ.16 వేల వరకు మాత్రమే ధర పలుకుతోంది. కనిష్టంగా పది వేలకు లోపే ఉంది. సాధారణంగా అయితే టన్ను రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు వాపోతున్నారు. వర్షాల వలన డిమాండ్ లేకపోవడంతో ధర పడిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న వ్యాపారుల దోపిడీ

ధర లేకపోవడం ఒకవైపు ఉంటే.. వ్యాపారుల దోపిడీ మరోవైపు కొనసాగుతోంది. అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డులోనే నిర్ణీత కమిషన్ కంటే ఎక్కువ రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. ఈ-నామ్ పద్ధతి ప్రకారమైతే నాలుగు శాతమే కమిషన్ వసూలు చేయాలి. ఇక్కడ మాత్రం పది శాతం వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇక నేరుగా తోటల వద్దకెళ్లి వ్యాపారులు కొనుగోలు చేస్తే 25 శాతం సూటు ఇవ్వాలి. అంటే పది టన్నులకు రెండున్నర టన్నుల కాయలు ఉచితంగా సూటు కింద వ్యాపారి రైతులు ఇవ్వాలి. ఇలా రెండు విధాలుగానూ రైతులు నష్టపోతున్నారు.

పెట్టుబడులు పెరిగాయి.. ధర లేదు

నాలుగున్నర ఎకరాల్లో చీనీ పంట సాగుచేశాను. నాలుగైదేళ్లు పంటను కాపాడుకున్న తరువాత దిగుబడులొస్తాయి. ఇంత కష్టపడి సాగుచేసి పంట చేతికొచ్చాక ధర ఉండటం లేదు. ఇంకోవైపు ఈసారి అనేక తెగుళ్లు వ్యాపించాయి. వాటి నుంచి రక్షించుకోవడానికి పెద్ద ఎత్తున మందులు వాడాల్సి వస్తోంది. వాటి ధరలు పెరిగాయి. అన్ని రకాలుగా కష్టాలుపడి సాగు చేసి పంటను మార్కెట్‌కు తీసుకొస్తే ధర ఏ మాత్రం ఉండటం లేదు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు.

సుదర్శన్‌రెడ్డి, చీని రైతు
కత్రిమల గ్రామం, పామిడి మండలం.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఉద్యానవనానికి పెద్దఎత్తున ఊతమిస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. అనంతపురం జిల్లాను హబ్‌గా మారుస్తామని చెబుతున్నారు. ఇప్పటికే మామిడి, మిర్చి రైతులు ధరల లేక తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు ఆ జాబితాలోకి చీనీ రైతులు చేరిపోయారు. టన్ను రూ.50 వేల వరకు పోతేగాని గిట్టుబాటు ఉండదు. మార్కెట్లోనేమో ధర రూ.16 వేల వరకే ఉంది. మామిడి రైతులకు రాయితీ ఇచ్చినట్లుగానే చీనీ రైతులకు ఇవ్వాలి. అదే విధంగా ఈ-నామ్ పద్ధతిలో వ్యాపారులు కుమ్మక్కవడంతో రైతులకు సరైన ధర రావడం లేదు. వేలం పాట ద్వారానే అమ్మకాలు చేపట్టాలి.

శివారెడ్డి, ఏపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా నాయకులు

మహిళలు, ఆడపిల్లల భద్రతే లక్ష్యం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా॥రాయపాటి శైలజ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో మహిళలు, ఆడపిల్లల భద్రతే లక్ష్యంగా మహిళా కమిషన్ పని చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా॥రాయపాటి శైలజ స్పష్టం చేశారు. బుధవారం ఆమె అనంతపురంలో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొని, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళల సంక్షేమం, భద్రత సాధికారతపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరికీ మహిళల చట్టాలపై సంపూర్ణ అవగాహన ముఖ్యమన్నారు. ఎక్కడైనా ఏదైనా ఒక ఘటన జరిగినప్పుడే కాకుండా వాటిని ముందస్తుగా నివారించడానికి చర్యలు తీసుకోవడం ప్రధానమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా భద్రతకు కట్టుబడి ఉందన్నారు. బాల్య వివాహాలు , గృహహింస, మహిళ ఉద్యోగులపై వేధింపులు తదితర వాటిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. మహిళలు, యువతులు శక్తి యాప్‌ను వారి సెల్‌ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ఈ యాప్ అపన్నహస్తంలా నిలుస్తుందని తెలిపారు. ఏదైనా సమస్య ఎదురైతే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. అంతకుముందు జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన కార్యక్రమాల స్టాల్సును సందర్శించారు. గృహహింస చట్టంపై రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగమణి, డిఎంహెచ్ఓ డా॥ఈబి.దేవి, మాజీ నగర మేయర్ స్వరూప, దిశా పోలీస్ స్టేషన్ సిఐ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా రక్షణకు ప్రాధాన్యత

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మహిళా రక్షణ, భద్రత, సాధికారతకు ప్రాధాన్యత ఇస్తోందని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ తెలిపారు. ఎస్ఎస్‌బిఎన్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆమె మాట్లాడారు. యువతలు సామాజిక మాధ్యమాల పరిచయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గృహ హింస చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. శక్తి యాప్‌ను ప్రతి మహిళలు, యువతులు వారి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఆపద సమయంలో శక్తి యాప్ మహిళలకు గొప్ప ఆపన్న హస్తంగా నిలుస్తుందని తెలియజేశారు. మహిళలు చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

అనంతపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ తనిఖీ చేశారు. పలు వార్డులను సందర్శించి బాధిత రోగులతో వైద్యసేవలపై ఆరాతీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥ఆత్మరాం, ఆస్పత్రి ఏవో మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు, నిర్మాణాలకు

ప్రణాళికలు సిద్ధం చేయండి : ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆమె గృహ నిర్మాణ శాఖపై సమీక్షా, సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎన్టీఆర్ హౌసింగ్ వెరిఫికేషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, బిఎల్‌సి హౌసింగ్ కార్యక్రమం, తదితర వాటిపై ఆరా తీశారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరి వివరాలు తెలుసుకుని వారికి పట్టాలు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, హౌసింగ్ అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. సమవేశంలో పరిటాల శ్రీరామ్, ఆర్డీవో కేశవనాయుడు, హౌసింగ్ పీడీ, డీఈ, ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల ఎంపిడిఒలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

శివాలయం జీర్ణోద్ధరణకు నిధులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరులోని పేటశివాలయ జీర్ణోద్ధరణ పనులకు నిధులు మంజూరు అయినట్లు ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు తెలిపారు. తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.ఆస్మిత్‌రెడ్డి సహకారంతో దేవదాయశాఖ సర్వశ్రేయోనిధి కింద రూ.96లక్షలు మంజూరు అయ్యాయని కమిటీ సభ్యులు గంగరాజు, నాగిరెడ్డి, చౌడేశ్వరయ్య, సుబ్బయ్య, జయరాం, శేషానంద రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనారాయణ తెలిపారు. నిధులను కేటాయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



ప్రొబేషనరీ ఎస్ఐలతో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి: ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

పోలీసుశాఖ ప్రతిష్ట పెంచేలా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ పి.జగదీష్ ప్రొబేషనరీ ఎస్ఐలకు సూచించారు. జిల్లాకు కొత్తగా 17 మంది ప్రొబేషనరీ సబ్-ఇన్‌స్పెక్టర్లు వచ్చారు. వీరిలో నలుగురు మహిళలు ఉన్నారు. జిల్లాలో ఐదు నెలల పాటు విధులు నిర్వహించే వీరితో ఎస్పీ బుధవారం తన ఛాంబర్లో సమావేశం నిర్వహించారు. పోలీసు విధుల్లో అత్యంత కీలకమైన శాంతి భద్రతలను కాపాడడం, నేరాలను అరికట్టడం, నేరస్తులను పట్టుకోవడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, క్రైం అగనెస్ట్ ఉమెన్ , సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల అనర్థాలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ప్రజలతో మర్యాదగా, గౌరవంగా మెలగాలన్నారు. నేరాల నియంత్రణకు సమాచారాన్ని సేకరించడం, నేరస్తులు, అనుమానితులపై నిఘా పెట్టి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడేరు మండలం బ్రాహ్మణపల్లి ఎన్‌సిసి క్యాంపులో బుధవారం నాడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో క్యాంపులో ఎన్‌సిసి కేడెట్లకు సైబర్ మోసాలపై అనంతపురం సైబర్ విభాగం పోలీసులు అవగాహన కల్పించారు. కొరియర్, చైల్డ్ ఫోర్నో గ్రఫీ, డిజిటల్ అరెస్టు, ఓటీపీ మోసాలు, ఫేక్‌లోన్ యాప్స్, హనీ ట్రాప్, లాటరీలు తదితర వాటితో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇలాంటి వాటిని భారినపడితే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. నేరం జరిగిన గంటలోపు (గోల్డెన్ అవర్)లో ఫిర్యాదు చేస్తే బాధితునికి కొంత వరకు మేలు చేసే అవకాశం ఉంటుందన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యల్లనూరు : తాడిపత్రి నుంచి పుట్లూరు మండలం కోమటికుంట్ల సబ్ స్టేషన్‌కు వచ్చే 132 కెవి విద్యుత్ లైన్ మరమ్మతులు దృష్ట్యా శుక్రవారం నాడు యల్లనూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అందుబాటులో లేని ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి

ప్రజాశక్తి-యల్లనూరు

మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ బదిలీ అయ్యి రెండు నెలలు అయ్యింది. అప్పటి నుంచి ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారిని మండలానికి కేటాయించారు. ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి కేటాయింపు జరిగి రెండు నెలలు అవుతున్నా ఆయన రైతులకు అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యి రెండు మాసాలు అయినా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే వారు కరువయ్యారు. ఇటీవల మండల కేంద్రానికి సబ్సిడీ కందులు వచ్చాయి. వాటి వివరాలను కూడా రైతులకు తెలియజేసే వారు కరువయ్యారు. విత్తన ధరలు, ఇతర వ్యవసాయ సంబంధిత విషయాలపై ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారిని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తే ఆయన ఫోన్ స్విచ్‌ఆఫ్ అనే వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండల ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల్లో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

బుక్కరాయసముద్రం : వైసిపి నాయకుడు గువ్వల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని బుధవారం మండల పరిధిలోని కొత్తపల్లి, పసులూరు గ్రామాల్లో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలోని అవాస్తవాలపై వైసిపి నాయకులు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తి విఎస్ జీవితం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కార్మిక సంఘం నేతగా, ముఖ్యమంత్రి వివిధ రంగాల్లో విఎస్.అచ్యుతానందన్ చేసిన పోరాటాలు, పరిపాలన స్ఫూర్తిదాయకం అని సిపిఎం నాయకులు కొనియాడారు. బుక్కరాయసముద్రం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద విఎస్ నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు. విఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ, కేరళ రాజకీయ చరిత్రలో విఎస్.అచ్యుతానందన్ పేరు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ఆయన చూపిన పోరాటాల జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కుల్లాయప్ప, పుల్లయ్య, నాగేంద్ర, ఎర్రన్న, నెట్టికల్లు, అంకాలు, పెద్ద పుల్లయ్య, చెన్నప్ప, నాగలింగమయ్య, చంటి, వెంకటప్ప, చిన్న గంగయ్య పాల్గొన్నారు.



విఎస్‌కు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

లక్ష్మీ సెహగల్, అచ్యుతానందన్‌కు నివాళి

అనంతపురం కలెక్టరేట్ : స్వాతంత్ర్య సమరయోధురాలు, మాజీ రాజ్యసభసభ్యురాలు కెప్టెన్ లక్ష్మి సెహగల్, కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు ఐద్వా ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఐద్వా ఆధ్వర్యంలో కెప్టెన్ లక్ష్మి సెహగల్ 13వ వర్ధంతి, అచ్యుతానందన్‌కు నివాళి కార్యక్రమాలను గణేనాయక్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రగతి, డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ లక్ష్మీ సెహగల్ డాక్టర్, రాజకీయ వేత్తగా ఆదర్శనీయమైన సేవలు అందించారని తెలిపారు. ఆమె జీవితం పోరాటం నిబద్ధతకు ప్రతీక అన్నారు. కేరళ ముఖ్యమంత్రి విఎస్.అచ్యుతానందన్ కార్మిక నేతగా, ముఖ్యమంత్రిగా విశేష సేవలు అందించారన్నారు. ఇలాంటి వారిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షులు శంషాద్, కార్యదర్శి అశ్విని, నగర కమిటీ నాయకులు గీత, పద్మావతి, ఫిర్యాది, శైలజ పాల్గొన్నారు.



మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించండి

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌కు ఐద్వా వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మహిళలు, బాలికల హత్య, అత్యాచారాలపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా॥రాయపాటి శైలజను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ అనంతపురం నగరంలోని రామక్రిష్ణ కాలనీలోని ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్యకు గురైందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారం, రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో 9వ తరగతి విద్యార్థినిపై 14 మంది అత్యాచారం ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలికలు, మహిళలపై బెదిరింపులు, లైంగిక దాడులకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. మహిళలపై అఘాయితాల్యకు కారణం అవుతున్న మద్యం, గంజాయిలను నిర్మూలించాలన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మలత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పంట సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత తెలిపారు. బుధవారం మండల పరిధిలోని సంజీవపురం, బొమ్మలాటపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె రైతులకు పంట సాగుపై పలు సూచనలు చేశారు. ఖరీఫ్ పంటలైన వేరుశనగ, వరి, మొక్కజొన్న, కంది, ఆముదం పంటలు సాగులో మెళకువులు పాటిస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్యాంసుందర్, ఉద్యాన సహాయకులు నవ్య, కావ్య, అలేఖ్య , సర్పంచి సుధాకర్ రెడ్డి, గోవింద్ రెడ్డి, వెంకట రెడ్డి, పాల్గొన్నారు.



పొలం పిలుస్తోందిలో పాల్గొన్న పీడీ పద్మలత

కురుగుంట, సజ్జలకాలువ గ్రామాల్లో పొలం పిలుస్తోంది

అనంతపురం : కురుగుంట, సజ్జల కాలవ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో వేరుశనగ వేసిన రైతులు 30-45 రోజుల్లోపు జిప్సం వేసుకుంటే కాయల సైజు, నాణ్యత బాగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి యు.భాగ్యశ్రీ, గ్రామ ఉద్యాన సహాయకులు లోకేశ్వరి, ఎంపిఇఒలు అనుపమ, నిర్మల, రైతులు పాల్గొన్నారు.

నూనె గింజల ఉత్పత్తికి కృషి చేద్దాం

జెడిఎ ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ

జాతీయ నూనెగింజల విత్తనోత్పత్తికి కృషి చేయాలని, ఈ క్రాప్ బుకింగ్ వేగవతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. ఆమె బుధవారం ఉరవకొండ, వజ్రకరూ రులో పర్యటించి రైతులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నార్మల్ ఏరియా 3 లక్షల హెక్టార్లు ఉండగా ఇప్పటివరకు 60వేల హెక్టార్లలో మాత్రమే రైతులు విత్తనం సాగు చేశారన్నారు. వర్షపాతం 40శాతం నమోదు కావడంతో రైతులు విత్తన సాగు చేసుకోలేక పోయారన్నారు. అక్కడక్కడ వర్షాలు కురవడంతో రైతులు విత్తనం వేస్తున్నారని తెలిపారు. రైతులు వ్యవసాయ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. అంతకుముందు ఆమె వజ్రకరూరు మండలంలోని పిసి ప్యాపిలి గ్రామంలో రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. అలాగే ఉరవకొండ మండలంలోని చిన్నముష్టూరు,పెద్ద ముష్టూరు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. రైతులందరూ నెలాఖరులోపు ఖచ్చితంగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. అనంతరం మూలగిరిపల్లి గ్రామంలో జాతీయ నూనెగింజల విత్తనోత్పత్తి పథకం కింద రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించారు. ఆమె వెంట ఎడిఎ సత్యనారాయణ, ఉరవకొండ, వజ్రకరూరు ఏవోలు రామకృష్ణ, మధుకర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది గంగన్న, రాధిక, శ్యామల, రైతులు ఉన్నారు.



పంట వివరాలు తెలుసుకుంటున్న జెడిఎ



సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

మరువకొమ్మ కాలనీకి ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తాం

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సారథ్యంలో మరువకొమ్మ కాలనీ ప్రొటెక్షన్ వాల్‌ను నిర్మిస్తామని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా 21వ డివిజన్ మరువకొమ్మ కాలనీలో టిడిపి నాయకులు బుధవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్తూ ఏడాది కాలంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధ్వర్యంలో అనంతపురం నగరంలో చేపట్టిన అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కాలనీలో ఇళ్ల పట్టాలు లేవని ప్రజలు వినతులు ఇవ్వగా ఎమ్మెల్యే దగ్గుపాట ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల పట్టాలు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌ఛార్జిలు శివకుమార్, నాగరాజు, నారాయణస్వామి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో బుధవారం సిఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.సురేష్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాలు వాడడం వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలకు గురికాకుండా ఎల్ఈడి స్క్రీన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీ సాయి డిగ్రీ కళాశాల సీఈఓ ఎ.శ్రీరాములు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎస్‌ఎస్ ట్యాంకుకు తుంగభద్ర నీరు పంపింగ్

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణానికి తాగునీరందించే రక్షిత నీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు తుంగభద్ర నీటి పంపింగ్‌ను బుధవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప గంగ పూజ చేసి ప్రారంభించారు. వారు కణేకల్లు వద్ద ఉన్న తుంగభద్ర ఎగువ కాలువ వద్ద మోటార్ స్విచ్ ఆన్ చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్యాంకు గరిష్ట సామర్థ్యం 3వేల మిలియన్ లీటర్లు కాగా ప్రస్తుతం ట్యాంకులో 1090 మిలియన్ లీటర్ల నిల్వ ఉందన్నారు. రోజుకు 12 నుండి 14 మిలియన్ లీటర్ల నీటిని 3 మోటార్లు ఉపయోగించి పంపింగ్ చేస్తే 130 రోజుల్లో ట్యాంకు పూర్తిగా నిండుతుందన్నారు. గతేడాది ట్యాంకులో తగినంత నీరు ఉన్నందువల్ల నీటి సమస్య లేకుండా చేశామన్నారు. పట్టణంలో నీటి సరఫరా మెరుగుకై రూ. 40 లక్షల ప్రత్యేక నిధులు కావాలని కలెక్టర్‌ను కోరామని, అవి మంజూరైతే పైపులైన్ మరమ్మతులు, విస్తరణ పనులు చేపడతామన్నారు. అమృత్ 2.0 కింద రూ. 76 కోట్లతో భవిష్యత్తు అవసరాల కోసం శాశ్వత తాగునీటి పథకాన్ని చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అవి మంజూరై హైబ్రిడ్ అండ్ డ్యూటీ మోడల్ పద్ధతిన చేపట్టేందుకు మొదటి దశలో టెండర్లు పిలవగా ఎవరూ వేయలేదన్నారు. స్థానికంగా జిందాల్ పరిశ్రమ ఉండగా పైప్ లైన్ ఏర్పాటుకు సహకారం ఇవ్వాలని కోరామన్నారు. ఈ పథకం పూర్తయితే రాబోయే 20 ఏళ్ల పాటు పట్టణంలో తాగునీటి ఎద్దడి ఉండదన్నారు. కార్యక్రమంలో కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ సురేష్, కౌన్సిలర్లు లావణ్య, గోవిందరాజులు, ప్రశాంతి, జ్యోతి, ఫకృద్దీన్, శివకుమార్, కోఆప్షన్ సభ్యులు నజీర్, మాజీ కౌన్సిలర్లు హనుమంతు, కృష్ణమూర్తి, సంపత్‌కుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు హనుమంతరెడ్డి, టిడిపి నాయకులు నాగరాజు, కృష్ణ, శ్రీనివాసులు, జిలాన్ పాల్గొన్నారు.


మోటార్ ఆన్ చేసి నీటి పంపింగ్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, మున్సిపల్ ఛైర్‌పర్సన్

'వైసిపి హయాంలో ఎన్నిరోడ్లు వేశావ్'

మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి ఎమ్మెల్యే సునీత సూటిప్రశ్న

ప్రజాశక్తి-ఆత్మకూరు

మీ సొంత మండలంలోనే ఒక్క ఏడాదిలోనే రూ. 12 కోట్లు వెచ్చించి రోడ్లు వేశాం.. వైసిపి హయాంలో ఐదేళ్లలో నువ్వు ఎన్ని రోడ్లు వేశావో సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఎమ్మెల్యే పరిటాల సునీత సవాల్ విసిరారు. ఆత్మకూరులో బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుపరి పాలనలో తొలిఅడుగు'కు అనూహ్య స్పందన వచ్చింది. ముందుగా ఎమ్మెల్యే భగత్ సింగ్ కాలనీ, జయరాం కాలనీల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. వ్యవసాయశాఖ అధికారులు, రైతులతో కలిసి కందులు పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు రూ. 2 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మండలంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వైసిపి హయాంలో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సొంత మండలాన్ని కూడా అభివృద్ధి చేసుకోలేకపోయాడని విమర్శించారు. టిడిపి సానుభూతిపరుల రేషన్ కార్డులు, పింఛన్లు తొలగించారని, సంక్షేమ పథకాలు అందకుండా చేశారన్నారు. నేడు పార్టీలకు అతీతకంగా అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామన్నారు. పూలహారాలు, బొకేల స్థానంలో నాయకులు కార్యకర్తలు, అధికారులు అందజేసిన నోట్ పుస్తకాలను కెజిబివిలో విద్యార్థినులకు అందజేశారు. భగత్‌సింగ్ కాలనీలో సిపిఎం కార్యాలయానికి స్థలం మంజూరు చేయాలని, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, రాము, వెంకటమ్మ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు.


ఆత్మకూరులో శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీత

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

రాప్తాడు : ఆత్మకూరు మండలానికి చెందిన ఆరుగురికి మంజూరైన రూ. 15.2 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించక ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటుందన్నారు. పేదల ఆరోగ్యం విషయంలో కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టడానికైనా సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తుంది రంగయ్యే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మున్సిపల్ ఛైర్మన్‌ను తన గుప్పెట్లో పెట్టుకుని మున్సిపాలిటీ అభివృద్ధికి 'అడ్డుకట్ట' వేస్తుంది వైసిపి సమన్వయకర్త, మాజీ ఎంపి తలారి రంగయ్యేనని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి 6వ వార్డు పార్వతీనగర్, 9వ వార్డు, 10వ వార్డు మారెంపల్లి, 11వ వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల అమలు, సమస్యలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపిలో అంతర్గత విషయాలతో రంగయ్యకు మెంటల్ వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. కౌన్సిల్ తీర్మానం లేకుండా నిధులు ఖర్చు చేయడానికి వీలుండదన్న విషయం ప్రభుత్వ అధికారిగా పని చేసిన రంగయ్యకు తెలియదా అని ప్రశ్నించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయన్నారు. మున్సిపాలిటీలో నిధులు ఉన్నా వాటిని అభివృద్ధి కోసం వినియోగించాలంటే కౌన్సిల్ తీర్మానం తప్పనిసరి అని, అయితే మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్ కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండా రంగయ్య అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. మారెంపల్లి కాలనీ వాసులు ఫిర్యాదు చేయగా విద్యుత్ తీగలను 2 నెలల్లో మారుస్తామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడతున్న చిట్టెమ్మ, డయాలసిస్ రోగి రోషన్‌కు ఆర్థికసాయం అందజేశారు. చిన్నారులు లాస్య, యశ్వంత్‌లకు స్కూల్ ఫీజు కోసం రూ. 20 వేలు ఇచ్చారు. త్వరలోనే కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సమస్యను పరిష్కరిసామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ యార్డ్ ఛైర్మన్ లక్ష్మీదేవి రమేష్, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ కోనంకి రాజశేఖర్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, ప్రభుత్వ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

ఆలయ నిర్మాణానికి చెక్కు అందజేత

మండలంలోని ఎం.కొండాపురం గ్రామంలో మారెమ్మ ఆలయ నిర్మాణం కోసం తితిదే శ్రీవాణి ట్రస్ట్ నుంచి రూ. 3 లక్షల చెక్కు రాగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆ గ్రామ సర్పంచి త్రివేణి లాల్‌కృష్ణ సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్థల దాతలు పేట నాగప్ప కుమారులు పేట వన్నూరప్ప, పేట ఆంజనేయ, పేట లక్ష్మీనారాయణ, పేట హనుమన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, టిడిపి నాయకులు తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఆర్ఎంపి అసోసియేషన్ సమావేశం

పామిడి : స్థానిక హోటల్ శ్రీనిధి రెస్టారెంట్‌లో బుధవారం ఎపి ఆర్ఎంపి అసోసియేషన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఎ గుమ్మనూరు జయరామ్ అసోసియేషన్ సేవలను గుర్తించి స్థానిక సాయి ఆసుపత్రి ఎండి చిలకల రాజగోపాల్‌ను ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా నియమించినందుకు కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. అలాగే ఆస్పత్రిలో మెరుగైన సేవలు లభించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగమస్తానయ్య, మండల అధ్యక్షులు నాగమల్లారెడ్డి, ఆర్ఎంపిలు అబ్దుల్‌మజీద్, మల్లికార్జున, ఫకృద్దీన్, శ్రీనివాసులు, అంజి, చౌహాన్‌నాయక్, రాము పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాల్లో చెత్త తొలగింపు

యాడికి : స్థానిక బుగ్గ రోడ్డులోని మోడల్ ప్రైమరీ స్కూల్ చుట్టూ స్థానిక ప్రజలు చెత్త వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లేది. దీనికి తోడు పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ విషయాలను లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, సామాజికవేత్త, స్టాంపు రైటర్ జూటూరు అబ్దుల్ రజాక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సొంత ఖర్చులతో జెసిబి ఏర్పాటు చేసి పాఠశాల పరిసరాల్లో ముళ్లపొదలు, చెత్త చెదారాన్ని శుభ్రం చేయించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వేధించేందుకే వైసిపి ఎంపి అక్రమ అరెస్ట్ : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం

రాజకీయ వేధింపుల్లో భాగంగానే కూటమి ప్రభుత్వం వైసిపి ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయించిందని నగర మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం మేయర్ వైసిపి మైనార్టీ నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా నాసిరకం మద్యం తెచ్చిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాసి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా వైసిపి శ్రేణులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. వైసిపి హయాంలో ప్రభుత్వ ఆధీనంలో మద్యం షాపులు నిర్వహించారని, అలాంటప్పుడు స్కామ్‌కు ఆస్కారం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. నేడు కూటమి నేతలే మద్యం షాపులు నడుపుతూ 24 గంటలు మద్యం అమ్మకాలు చేస్తూ, ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు అమ్ముతూ, విచ్చలవిడిగా బెల్ట్ షాపుల పేరిట దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వైసిపి శ్రేణులు భయపడరని జగన్ వెంటే నడుస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లా బేగ్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాగజ్ ఘర్ రిజ్వాన్, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హుస్సేన్‌పీరా, కమార్ తాజ్, ఎకెఎస్ ఫయాజ్, కార్పొరేటర్లు ఉన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, ముస్లిం నాయకులు


ఆసుపత్రిలో చిరంజీవిని పరామర్శిస్తున్న మాదినేని

వైసిపి నాయకుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కంబదూరు మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు చింతకాయల చిరంజీవి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలియడంతో ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు బుధవారం అతడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ. 20 వేలు అందజేశారు. ఆయన వెంట కర్తనపర్తి, రాంపురం సర్పంచులు శివన్న, చెన్నప్ప, ఎంపిటిసి మారెన్న, తలారి సత్తి, నరేష్ ఉన్నారు.

కళ్యాణ్ దుర్గం టౌన్ : ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిరంజీవిని సామాజిక సేవ నాయకుడు జికె కృష్ణమూర్తి కలిసి పరామర్శించి రూ. 50 వేలు అందజేశారు. అవసరమైతే మరింత సహాయం అందిస్తానని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ ఛైర్మన్ జయం ఫణి, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబురెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచి ఉన్నారు

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-పుట్లూరు

తాడిపత్రి నుంచి పుట్లూరు మండలంలోని కోమటికుంట్ల సబ్ స్టేషన్‌కు వచ్చే 132 కెవి విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 25వ తేదీ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి-యాడికి

తాడిపత్రి నియోజకవర్గ తెలుగు యవత ఉపాధ్యక్షుడు తాంత్ర విక్రమ్ జన్మదినం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య విక్రమ్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు స్టోర్ డీలర్ మహమ్మద్ రఫీ, హాజీవలి, నరేంద్ర, తాంత్ర హరికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీని జయప్రదం చేయండి

శింగనమల : ఆగష్టు 4, 5 తేదీల్లో శింగనమలలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయ ప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక జూనియర్ కాలేజ్‌లో ప్లీనరీ సమావేశాల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సమావేశాల్లో రాష్ట్రంలో విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలకు శ్రీకారం చుట్టడం, ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. కావున విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, అమృతరాజ్, నందకిషోర్, చరణ్, భాస్కర్, బాబు, నవీన్, ప్రవీణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లను అడ్డుకుంటాం

రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు

ప్రజాశక్తి-బెళుగుప్ప

స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీల తగ్గింపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించే అంశాలపై బుధవారం స్థానిక హమాలీ యూనియన్ కార్యాలయంలో రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బిహెచ్.రాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్లకు మేలు చేస్తూ ప్రజలపై భారాలు మోపేలా వ్యవసాయ పంపుసెట్లు, గృహాలు, ఇతర వాటికి స్మార్ట్ మీటర్లు బిగించడం దుర్మార్గమన్నారు. ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకూ అన్ని గ్రామ, పట్టణ, కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేసి స్మార్ట్ మీటర్ల వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ చైతన్యం చేస్తామన్నారు. ఈ నెల 30 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకూ వివిధ రూపాల్లో ప్రచారం చేస్తామన్నారు. ఆగస్టు 5వ తేదీ అన్ని విద్యుత్ కార్యాలయాల ముందు విద్యుత్ వినియోగదారులతో నిరసనలు, ధర్నాలు చేస్తామన్నారు. ఇందులో రైతులు, కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల నాయకులు నరసింహులు, లక్ష్మిరెడ్డి, పురుషోత్తం, కృష్ణమూర్తి, సిఐటియు మండల కార్యదర్శి బికె.భీమన్న, హమాలీ యూనియన్ నాయకులు మారెన్న, మల్లికార్జున, వెంకటేశులు, పాతన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.


సమావేశమైన రైతు సంఘం నాయకులు

పట్టుబడిన మద్యం ధ్వంసం.. వాహనాల వేలం..

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం వేశారు. మొత్తం 24 వాహనాలకు గానూ 19 వాహనాలను వేలం పాటలో రూ. 1,44, 550 చెల్లించి వేలం దారులు దక్కించుకున్నారు. డి.హీరేహాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన 12 వాహనాలను వేలం వేశారు. రాయదుర్గం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన 77 కేసుల్లోని 812 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. అలాగే బొమ్మనహాల్, బెళుగుప్ప పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన కేసుల్లోని మద్యాన్ని కూడా ధ్వంసం చేశారు. రాయదుర్గం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల లైసెన్సుదారులతో సమావేశమై సూచనలు చేశారు. అనంతరం ఆయన విడపనకల్లు, ఓబుళాపురం చెక్‌పోస్ట్‌లను తనిఖీ చేసి విధి నిర్వహణలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎక్సైజ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిఐ జయనాథరెడ్డి, స్థానిక ఎక్సైజ్ సిఐ మహేష్‌కుమార్, ఎస్ఐలు పవన్, దామోదర్, గురుప్రసాద్, బెళుగుప్ప, బొమ్మనహాల్ ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.


పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ప్రజా సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-బెళుగుప్ప

అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజల సమస్యలు పరిష్కారంపై దృష్టి పెట్టాలని ప్రజాప్రతినిధులు కోరారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎంపిపి పెద్దన్న అధ్యక్షతన సాధారణ మండల సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ మండలానికి మోడల్ స్కూల్ వచ్చేటట్లు, కెజిబివిలో సీట్ల పెంపునకు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే సభ లేదా అధికారుల దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయా శాఖల అధికారులు తెలిపారు. పొలాల్లో చిరుత పులి సంచరిస్తుందని దానిని బంధించి తరలించాలని ఆవులెన్న బ్రాహ్మణపల్లి తండా రైతులు కోరారు. పంటలను జింకల గుంపులు నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో డివైఈవో అధికారి పి. మల్లారెడ్డి, ఎంపిడిఓ లక్ష్మినారాయణ, ఎంఇఓ హరి కృష్ణ, వైస్ ఎంపిపి పుష్పావతి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించండి

ప్రజాశక్తి-పామిడి

ఆర్‌డిటి విదేశీ నిధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి. మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. ఇదే అంశంపై బుధవారం స్థానిక మోడల్ స్కూల్ ఆవరణలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. మోహన్ నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతున్న ఆర్‌డిటి సేవలు యథావిధిగా కొనసాగాలంటే కూటమి ప్రభు త్వం చొరవ చూపాలని కోరారు. వెంటనే కేంద్రంతో మాట్లాడి ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామంజనమ్మ, అంజలి, సాలమ్మ, మౌనిక, సావిత్రి, చంద్రకళ, మహాలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

పామిడి : స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఐక్య మాదిగ సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు పదో రోజుకి చేరాయి. దీక్షా శిబిరంలో ఐఎంఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు వంకరాజుకాలువ వెంకటేసు, నాయకులు రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు కొండూరు సుదర్శన్, వికలాంగుల సంఘం సభ్యులు వంకరాజుకాలువ కేశవ, ఎం.ఓబుళపతి, రాజేష్, నాగశేఖర్, ఎపి ఎమ్మార్పీఎస్ డప్పు కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు హెచ్‌కె. నాగరాజు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తాడిపత్రి మండలంలోని పెద్దపడమల గ్రామ హైస్కూల్ విద్యార్థులు పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ముందుగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు రాసిన పోస్ట్‌కార్డులతో గ్రామంలో ప్రదర్శన ర్యాలీ చేపట్టారు. అలాగే పెద్దపప్పూరు మండలంలోని జూటూరు గ్రామంలో విద్యార్థులు ఆర్‌డిటి సేవా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కేంద్ర మంత్రి అమిత్‌షాకు 260 పోస్టుకార్డులు రాసి పోస్ట్ ఆఫీస్ వద్ద పోస్ట్‌బాక్సులో వేశారు. కార్యక్రమంలో టి.ఆదినారాయణ, చింతా పురుషోత్తం పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడు మృతి

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మండలంలోని నేత్రపల్లి గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు పరమేశ్వరప్ప(60) బుధ వారం ఉదయం అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో మతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయన భార్య అంగన్వాడీ వర్కర్‌గా పని చేస్తున్నారు. వారికి సంతానం లేరు. పరమేశ్వరప్ప వృత్తి పట్ల నిబద్ధత, అంకిత భావంతో పని చేశారు. ఈయన 25 ఏళ్లుగా పలు దిన పత్రికల్లో పని చేశారు. పరమేశ్వరప్ప మృతి పట్ల పాత్రికేయ మిత్రులు, యూనియన్ సభ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఒక మంచి వ్యక్తిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.


పరమేశ్వరప్ప(ఫైల్‌ఫొటో)

మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌కు సన్మానం

గుత్తి : గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుర్రాల సూర్య ప్రతాప్‌ను బుధవారం సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండలంలోని జక్కలచెరువు గ్రామ సచివాలయంలో ఆయనను శాలువా, పూలమాల లతో సత్కరించారు. అనంతరం బదిలీ అయిన సచివాలయ సిబ్బందిని నూతన సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఇసురాళ్లపల్లి సర్పంచి వాసుదేవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ రాజన్న, స్టోర్ డీలర్ హనుమంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌కు వైసిపి వినతి

అనంతపురం : అనంతపురం పర్యటనకు వచ్చిన ఎపి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజను బుధవారం నగరంలోని ఎస్-ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో వైసిపి నేతలు కలిశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇటీవల సామూహిక అత్యాచారానికి గురైన దళిత బాలిక, హత్యకు గురైన గిరిజన విద్యార్థిని కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె బాధితులకు న్యాయం జరిగేలా చూస్తా నని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సాకే చిరంజీవి, సాకే శ్రీనివాసులు, నాగరాజు నాయక్, సాకే చంద్రలేఖ, మణికంఠ, సంగమేష్, అంజలి, తలారి ఉష, రాధాయాదవ్, భారతి, లీల పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-యాడికి

యాడికి మేజర్ పంచాయతీలో చేయని పనులకు అక్రమంగా బిల్లులు చేయించుకున్న, చేయడానికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో ఎంపిడిఓ వీర్రాజుకు ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ యాడికి మేజర్ పంచాయతీలో ఇటీవల పనులు చేయకుండానే చేసినట్లు దొంగ బిల్లులు చూపించి నిధులు మంజూరు చేయించుకున్న నాయకులు, బిల్లులు మంజూరుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపిడిఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చేనేత మండల కార్యదర్శి బండారు రాఘవ, సిపిఐ వడ్డే రాముడు, నాయకులు శివన్న, నబిరసూల్ పాల్గొన్నారు.

గూగూడులో హుండీ గల్లంతు అపోహ మాత్రమే

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటుచేసిన తాత్కాలిక హుండీల్లో ఒకటి గల్లంతయిందని గూగూడులో ప్రచారం జరుగుతుందంటూ బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పం దించిన ఆలయ ఈవో శోభ గ్రామ పెద్దల సమక్షంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. తాత్కాలిక హుండీ పక్కదారి పట్టిందనడంలో ఎటువంటి వాస్తవం లేదని, ఇది కేవలం అపోహ మాత్రమే అని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో గ్రామ పెద్దలు, పోలీస్ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతుందని పక్కదారి పట్టడానికి ఆస్కారమే లేదని వివరణ ఇచ్చారు. అయితే ఆలయంలో ఉన్న పచ్చ హుండీ ట్రాక్టర్‌లోకి ఎక్కించారనే ఆరోపణలు ఉన్నాయని, సీసీ ఫుటేజ్ చూపించాలని పాత్రికేయులు ప్రశ్నిం చగా ఉన్నతాధికారులకు చూపిస్తామని తెలిపారు. సమావేశంలో జాఫర్‌వలి, రాజారెడ్డి, రాజన్న, నరసింహులు, ఓబులేసు, శివయ్య, రాజు, ఓబులేసు, మిద్ది రాజేష్, రాజశేఖర్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈవో శోభ, గ్రామపెద్దలు

ఆనందరావుపేటలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని ఆనందరావుపేట గ్రామంలో సమస్యలు పట్టిపీడిస్తున్నా అధికారులు పట్టించుకో వడం లేదని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ విమర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆనందరావు పేటలో విద్యుత్ దీపాలు వెలగడం లేదని దీంతో ప్రజలు రాత్రి వేళ బయటకు రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రావాల్సి వస్తుందన్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇకనైనా అధికారులు గ్రామంలో పర్యటించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని లేకపోతే ఎంపిడిఓ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రామ్‌దాసు, లక్ష్మీనారాయణ, పెద్దకుళ్లాయప్ప, నాగేంద్ర, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు


ప్రభుత్వ విప్ కాలవకు పూలమాల వేస్తున్న టిడిపి నాయకులు


చెరువులో జలహారతి ఇస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

చివరి ఆయకట్టుకు నీరిస్తాం

కణేకల్లు చెరువులో జలహారతి ఇచ్చిన ప్రభుత్వ విప్ కాలవ

ప్రజాశక్తి-కణేకల్లు

చివరి ఆయకట్టు వరకూ సక్రమంగా నీరందేలా చూస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివా సులు రైతులకు హామీ ఇచ్చారు. పాలేరు లాగా రైతులకు అందుబాటులో ఉంటానని, వాళ్ల కష్టాలు, సంతోషాల్లో తోడుగా నిలుస్తానని తెలిపారు. రైతుకు ఏ కష్టం రాకుండా చూసుకొనే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. కణేకల్లు చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువుకు చేరుకున్న తుంగభద్ర జలాల వద్ద బుధవారం కాలవ జలహారతి నిర్వహించారు. కాలవ మాట్లాడుతూ కణేకల్లు మండలంలో హెచ్ఎల్‌సి కింద ఎక్కువ విస్తీర్ణంలో ఆయకట్టు సాగుతోందన్నారు. ఈ ఏడాది రైతులందరూ సక్రమం గా పంటలు పండించుకోవాలని, అందుకనుగుణంగా నీటి సరఫరాకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించామన్నారు. రూ. 35 కోట్లతో తుంగభద్ర ఎగువ కాలువ లైనింగ్, బ్రిడ్జిలు, యుటిల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. ఈ ప్రాంతంలో నాణ్యమైన ధాన్యం పండిస్తుండటంతో కర్నాటకలో కూడా ఎక్కువ ధరకు బియ్యం అమ్ముడుపోతున్నా యన్నారు. అనంతరం ఆదర్శ భారతి సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైన రైస్ మిల్లు చంద్రశేఖర్‌గుప్తాను ప్రమాణ స్వీకారం చేయించారు. చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సహకారంతో రైతులకు ఎటువంటి సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాలెప్ప, షేక్ ఫకృద్దీన్, ఆనందరాజు, ఆది, రమేష్, చాంద్, బాగెన్న, తిప్పేస్వామి, హనుమంతరెడ్డి, వన్నారెడ్డి పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని వంకరాజుకాలువ, నెమల్లపల్లి గ్రామాల్లో బుధవారం ఏవో విజయ కుమార్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్ష చేయించాలన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు, యాజమాన్యం గురించి వివరించారు. వివిధ పైర్లకు ఏఏ ఎరువులు ఎంత మోతాదులో వేసుకోవాలి, విత్తన ఎంపికలో మెలకువలను తెలిపారు. నెలాఖరు లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఇఓలు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండలంలోని గొందిరెడ్డిపల్లి, బొమ్మేపర్తి గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఏవో కృష్ణచేతన్య రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు, ఇచ్చారు. కౌలు రైతులు కార్డులు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఓ రంజిత, సుజిత, పిహెచ్ఎ భార్గవ్, ఎంపిఇఓ ధనలక్ష్మీ, రేష్మ, రైతులు పాల్గొన్నారు.

డి పట్టా ఫారం పోయినది

అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన పుట్లూరు సుధ W/o భైరవేశ్వరరెడ్డి అనే రైతుకు చెందిన తహసీల్దార్ జారీ చేసిన DArdis:13/1418 తేది:1/8/2009 నెంబరు గల వ్యవసాయ భూమి అప్పగింత పట్టా పోగొట్టుకున్నారు. ఎక్కడ వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. ఎవరికైనా ఆచూకి తెలిస్తే పుట్లూరు మండలం పోలీస్ స్టేషన్‌లో గానీ, రైతు ఫోన్ **నెంబర్:7013400588** కు సమాచారం ఇవ్వగలరు.